# అన్నా - చెల్లెలు

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీ నరసింహశాస్త్రి

"బొత్తిగా నామాటే చెవిని పెట్టకుండా పోతున్నావు. ఏమిటే అమ్మాయి యీవేషం. ఎవరైనా చూస్తే యేమనుకుంటారు" లోపలికి వస్తున్న వసంతనుచూసి, శాంతమ్మ అంటోంది.

"ఎప్పటి కప్పుడు యెవరో అనుకుని పోతారేమో అనే ఆదుర్దాయే తప్ప, నువ్వేమి అనుకుంటున్నావో చెప్పవేమే...."వసంతనవ్వుతూ, తల్లి మొహంలోకి చూసింది.

"నీకీ మాత్రం తెలియద్దుటే యీడొచ్చిన పిల్లవి....

"నాకేం తెలియాలో నువ్వు చెప్పవే అమ్మ ...."

"నేనేమంటుంటే యేంలాభం? నువ్వు చెయ్యదలచుకున్నదేమిటో చేస్తూనే వుంటేను.... !"

"అదీతప్పులేదమ్మా...."

"నీతో యెందుకొచ్చిన వితండవాదన కాని నీళ్ళు పోసుకో.... ఇంత అన్నం తిందుకాని ....ఎక్కడెక్కడ తిరిగి యేమేమి ఆడివచ్చావో...."

"నీకు యేమి మాట్లాడాలో కూడా తెలీదమ్మా. ఏమాట వస్తే, ఆమాట అనేశేస్తావు మంచి అమ్మవి...."

"అవునుకాని అమ్మాయి ! నామాటవినవు....అషాఢం వెళ్ళిపోయింది కదా...."

'శ్రావణం వచ్చేసింది...."

"మాటకు మాట సమాధానం చెప్పటం నేర్చుకున్న దానివి, యింతమాత్రం గ్రహించుకోలేవేమంట. నీయీడు పిల్లలందరికి పెళ్ళిళ్ళు అయిపోతున్నాయి. నువ్వు యిట్లాగేవుంటే లోకం యేమను కుంటుంది...."

"నువ్వేమి అనుకుంటున్నావో చెప్పవే అమ్మా నిజంగా..."

"నీకు కూడా పెళ్ళి అయితే బాగుంటుందనుకుంటున్నా...." అంతే. అంతకంటే నేను కోరుకునేదేముంది...."

"నేను చెప్పనా నేను అనుకుంటున్న దేమిటో ...."

"ఇంకా సందేహం యెందుకు....చెప్పు...."

"నేను కూడా పెళ్ళి చేసుకుందా మనుకుంటున్నా ..."

"మంచిదానివమ్మ....నేను చెప్పినట్లు చేస్తావు ....ఈ మాటకాస్తాచెప్పటానికి యింతమధన పెట్టావెందుకే ...."

"ఈమాట చెప్పటం యెందుకమ్మ. నేనెపుడైనాపెళ్ళి చేసుకోను అని చెప్పాను కనకనా...."

"ఏమిటోనే, నీ మాటలధోరణి నాకసలు అర్థంకాదు. ఇంతకీ తేల్చి చెప్పేసెయ్యి .... యీ శ్రావణ మాసంలో పెళ్ళికి వప్పుకుంటావా లేదా చెప్పు..."

"అడుగోనే అన్నయ్య వస్తున్నాడు ....నువ్వు కూడా సమయానికి వచ్చావు, అమ్మ ఓ ప్రశ్న అడుగుతోంది.... సమాధానం చెపుతావా...."

"నిన్ను అడుగుతుంటే. నేను సమాధానం చెప్పటమేమిటి. మీ గొడవలు మీరు చూసుకోండి .... " మధు నిర్లక్ష్యంగా గదిలోకి వెళ్ళిపోయాడు.

"ఏమిటే అమ్మాయిమరీను! వాడితోకూడా యెందుకు యీ రభస...."

"రభసేముంది దీంట్లో....ఇంత వరకు యెంతమంది వచ్చి పోతున్నారు. ఏదైనాసమాధానం చెప్పారే. ఇట్లాగే వుంటుంది యేదైనా....అన్నయ్య పెళ్ళిచేసు కున్నతర్వాతే నామాట...."

"అయ్యో! అయ్యో! నీకేమన్నా పిచ్చి పట్టిందా యేమిటి మగవాళ్ళతో వంతు పెట్టు కుంటారుటే, వాడు

స్వతంత్రుడు. వాడు యిష్టం వచ్చినప్పుడు పెళ్ళి చేసుకుంటాడు. అయినా నేను చెపితే వింటాడు కనకనా...." శాంతమ్మ విడ్డూరంగా చూసింది.

"అవున్లే....తల్లివి పెద్దదానివి అని నీమాటవింటుంటే అదినీకు చులకన అయిపోయింది అంతేనా ...." వసంత గబగబా అనేసింది.

"ఏమిటా మాటలు....నా పెద్దరికం నిన్నేం చేసింది నీమంచి కోసమేనా నేను చెప్పేది. పెద్దవాళ్ళ మాటలు. వింటే చెడిపోయిన వాళ్ళని యెవ్వర్నీ చూడలా." శాంతమ్మ కూడా కొంచెం కోపంగానే అన్నది.

"నీకంత బరువవుతే నాదారి నేను చూసుకుంటాగాని నువ్వు మాత్రం నాకోసం కంటతడి పెట్టక ....నాన్న. గాని, నువ్వుగాని అన్నయ్యను పల్లెత్తుమాట అనటానికి సాహసించలేదు. గాని, నేను యీ చదువుకాస్త పూర్తి చేసుకుని, నాదారిని నేను పోతానంటుంటే, ....నాకోసం మీరు బాధపడకండి ...." వసంత వుక్రోషం పట్టలేకపోయింది.

"నువ్వనటం, వాడు చేస్తున్న పనులన్నింటినిహర్షించి వూరుకుంటున్నా మనుకుంటున్నావా ...." శాంతమ్మ ఎదురు ప్రశ్న వేసింది.

"అయితే నేను నలుగురితో క్లబ్బులో వుంటే మీ బుర్రలు తిరిగిపోతాయెందుకు...." వసంత యింకావుద్రేకంగానే మాట్లాడుతోంది.

"నీసంగతి నాకుతెలీదుటే. ఇరుగు పొరుగు అంటారు. నలుగురు, పెళ్ళికాని పిల్ల అట్లా తిరుగుతూవుంటే యేమనుకుంటారు చెప్పు...."

"ఎప్పటి కప్పుడు నలుగురు యేమనుకుంటారో అనే గోలతప్ప. నీకు తెలుసుగదా నా సంగతి, ఆసంగతే మిటో ఖచ్చితంగా వాళ్ళమొహాన చెప్పేసే ధైర్యంలేదు నీకు. ఒక్కసారి నువ్వుచెపితే, వాత పెట్టినట్లుంటుందే, మళ్ళావాళ్ళనోరెత్తుతారా...అసలు నీకే అనుమానంలే నామీద.... కన్న తల్లే కూతురి విషయం తెలుసుకోకపోతే. నేను యింకెవ్వరితో మొర పెట్టుకోను ...."వసంత దుఃఖము.ఆపుకోలేకపోయింది.

"అహా... సంగీతం మొదలు పెట్టావు .... ఏమిటా యింతసేపటి నుంచి లేదనుకుంటున్నా.... పాత పాటేనా ఏదైనా కొత్తది వచ్చిందా..." మధు పకపక నవ్వాడు.

"నవ్వగానే సరికాదు ... నలుగురు యేమను కుంటున్నారోతెలుస్తోందా..."వసంత తీవ్రంగా అన్నదిమధుతో,

"నువ్వు అమ్మతో వాదిస్తూ వుంటావుగా. జ్ఞాపకం రాలేదా...." మధు నవ్వుతూనే వున్నాడు.

"అవును .. నేను అనుకుంటున్నదీ, నలుగురూ అనుకుంటున్నదే....అందువల్లనే అట్లాచెప్పాను....అంత మాత్రం తెలుసుకోలేకపోలే ...." వసంతసేన లేచి ను ుంది.

"ఏమిటే నీకు తెలిసింది. ఆట్టేవాగక .... నీ గొడవ నువ్వు చూసుకో ...శేఖర్‌కు నాకు పరిచయం లేదనుకుంటున్నావేమొ ..." మధు విసురుగా వాకిట్లోకి వెళ్ళిపోయాడు. శాంతమ్మ ఆశ్చర్యంగా వసంత మొహంలోకి చూసింది

వసంతకు పట్టుదల యింకా యెక్కువయింది. ధైర్యం వచ్చినట్లనిపించింది. మామూలుగా తన గదిలోకి వెళ్ళిపోయింది. శాంతమ్మకు కాళ్ళు చేతులు ఆడటంలేదు. తత్తర బిత్తరగా అటుయిటు తిరుగుతోంది. ఒకటి రెండు సార్లు వసంతగదిదాకా వెళ్ళిమళ్ళీ ధైర్యంచాలక వెనక్కువెళ్ళి పోయింది.

వీధి తలుపు తీసుకుని, శంకరం ఆదరా బాదరాగా యింట్లోకి వచ్చేశాడు. శాంతమ్మకు గుండెబరువు తగ్గినట్లనిపించింది. గబగబ శంకరం దగ్గరకువచ్చి, విన్నారా అని మొదలుపెట్ట పోతోంది శాంతమ్మ.

"వింటావుగాని....రామనాధంగారి అబ్బాయి యివ్వాళ సాయంత్రమే మన అమ్మాయిని చూడటానికి వస్తాడు. ఏర్పాట్లన్నీ చెయ్యాలి ఇంట్లోచూసి యేంకావాలో చెప్పు తొందరగా...." శంకరానికి యింట్లోకాలు నిలవటం లేదు.

"అన్నట్టు అమ్మాయి యెక్కడ...." శంకరం మళ్ళీ అడిగాడు

"అదిగో....ఆ గదిలోవుంది...." శాంతమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

శంకరం, వుత్తరీయాన్ని, చిలక్కొయ్యకు తగిలించి చొక్కా విప్పుకుంటూ. మెల్లిగా గది దగ్గరకు వెళ్ళాడు. "అమ్మాయి" అంటూ గట్టిగా పిలిచాడు శంకరం.

"ఎవరూ...." అంటూ సన్నగా వసంత గొంతుక వినిపించింది.

"ఇప్పుడేం నిద్రే ..." శంకరం వసంత వైపుకు చూస్తూ అన్నాడు.

"ఏమిటో. పడుకుంటే నిద్రపట్టినట్లుంది ..." కళ్ళు నులుపుకుంటూ సావిట్లోకి వచ్చేసింది వసంత.

శంకరం తడబడు తున్నాడు వసంతతో. సాయంత్రం వాళ్ళు వస్తారని చెప్పటానికి. కాసేపు ఆగినట్లు ఆగి, "అమ్మాయి....నీకోసారి అదివరకు చెప్పినట్లున్నాను.... ఆ....ఏంలేదు శేషగిరిరావని, రామనాథంగారి అబ్బాయి. మంచి అస్తుంది. చదువు ఓమాదిరి అయినా యీరోజుల్లో చదువుకున్న వాళ్ళకి యేమాత్రం వుద్యోగం వస్తోందిలే ఆయన యీ సాయంత్రమే యిక్కడికి వస్తాడుట.... లాంఛనంగా పిల్లా, పిల్లాడు, ఒకర్నొకరు చూసుకోవాలిగా. అందుకని...." నీళ్ళునములుతూ శంకరం యెంతో ఆదుర్దాగా వసంతవైపుకు చూస్తూ నిలబడ్డాడు.

"అట్లాగే నాన్న ...."

శంకరం వుక్కిరిబిక్కిరి అయిపోయాడు. ఇట్లాసమాధానం వస్తుందని శంకరం వూహించలేదు. శంకరం యేమిమాట్లాడటానికి పాలుపోవటం లేదు. కొంచెం కంగారుగా అటు యిటు తిరిగి దొడ్లోకి వెళ్ళాడు.

"విన్నావా...." శంకరం చెప్పబోతున్నాడు. "వింటానుగానీండి....ఇదిగో చీటి యీ వస్తువులన్నీ తీసుకురండి ఎక్కువ వ్యవధిలేదు...." శాంతమ్మ చీటి అందిచ్చింది.

శంకరం తెచ్చిన వస్తువులతో కావలసినవన్నీ తయారయి పోయినాయి.

"అమ్మాయితో చెప్పాను. అట్లాగే నాన్న ..." అన్నది. అని మెల్లిగా శంకరం శాంతమ్మతో సంతోషంగా చెప్పాడు.

"అనకేం చేస్తుంది ...." ఎంతో తేలికగా అనేసింది శాంతమ్మ.

వాకిట్లో గుర్రపుబండీ ఆగింది. మధు ముందరదిగాడు ఎదురుగా శంకరం. చెంబునీళ్ళు తీసుకు వెళ్ళాడు.

"ఏయ్....వసంతా....నిన్నే....బావ వచ్చాడు".మధు. వసంత దగ్గరకు వెళ్ళి, చెవులో అన్నాడు.

వసంతకు చర్రున కోపం వచ్చింది. ఆ పట్టున మధు చెంప పగిలిపోయేదే. ఎందుకనో పస్తాయించింది.

ఇంకా వుడికించటానికి యేవేవో అనేస్తున్నాడు మధు. వసంత సహించి వూరుకుంటోంది.

"శేఖర్‌కు నాసానుభూతి...."అంటూ మధు లోపలికి వెళ్ళిపోయాడు.

వసంతకు పట్టరాని దుఃఖము వచ్చేసింది కాని ఆ సమయంలో యేమీ అనేటట్లు కనిపించ లేదు.

సావిట్లోకి అంతా వచ్చేశారు. శేషగిరిరావు, రామనాథం, శారదమ్మ ఒక లైనులో కూర్చున్నారు. శాంతమ్మ వసంత, యింకొంచెం దూరంగాకూర్చున్నారు. వసంతకు యెదురుగా మధుకూర్చున్నాడు. శంకరాన్నికూడా కూర్చోమని అంటున్నారు.

"శేషు....అటువైపుకు తిరుగు .... మావాడికి మహాసిగ్గండి....ఆడపిల్లకంటె ... యెక్కువ ...." శారదమ్మ నవ్వుతూ అన్నది.

శంకరం నవ్వాలనుకుని నవ్వాడు. మధు నవ్వాలని నవ్వాడు. శాంతమ్మ నవ్వకూడదేమో అనుకుంటూనే ఆపుకోలేక పోయింది. శారదమ్మ యేమనుకుని పోతుందో అని రామనాథం నవ్వాడు. శేషు, వసంతను నవ్వించాలని నవ్వాడు. అంతమందిలో తాను యింకో విధంగా వుండటానికి వీల్లేక వసంతా నవ్వింది.

"అమ్మాయి సంగీతం యేమన్నా పాడుతుందా ...." సాగదీసుకుంటూ శారదమ్మ అన్నది.

"మొదట్లో సంగీతం బాగానే చెప్పించాం.... అయితే యీ కాలేజీచదువులకు దానికీకుదరక ఆపేసింది. అయినా పదిపదిహేను కీర్తనలు నేర్చుకుందిలెండి ....అమ్మాయి" వసంత వైపుకు చూసి పాడమంది శాంతమ్మ.

వసంత ముభావంగా వూరుకుంది. కాని శాంతమ్మ రెండు మూడుసార్లు హెచ్చరిస్తోంది.

"ఏమిటి అమ్మాయి మరీ అంతపెంకెతనమా మీఅమ్మ అన్నిసార్లు చెపుతుంటే. ఓ పాటపాడరాదు...." శారదమ్మ అత్తగారి పెత్తనం చెలాయిద్దా మనుకుంది.

"నాకు డాన్సు కూడా వచ్చు ఆడమంటారా ...." అంటూ చివాలునలేచి నుంచుంది వసంత.

శేషు నిర్ఘాంత పోయాడు. శంకరం గుండె ఝల్లు మన్నది. శారదమ్మ నివ్వెరపోయింది. రామనాథం భయపడి పోతున్నాడు. శాంతమ్మకు యేమనాలో తోచటంలేదు

"అట్లాగే చెయ్యి. నలుగురూ చూసి సంతోషిస్తారు" మధు తీవ్రంగా లేచి వాకిట్లోకి వెళ్ళి పోయాడు.

ఎక్కడి వాళ్ళు అక్కడికి గుట్టుచప్పుడు కాకుండా వెళ్ళి పోయారు.

"అమ్మాయి నువ్వేదో మనవంశ గౌరవాన్ని నిలబెడతావని, మేంచెప్పిన మాటవింటావని యెంతో ఆశపడ్డాం. నలుగుర్లో మమ్మల్ని నగుబాట్లు చేస్తావని మేము

యెప్పుడూ అనుకోనేలేదు...." శంకరం యెంతో బాధ పడుతూ అన్నాడు.

"ఇంక మనం తలెత్తుకు తిరగ గలమా! ఇన్నాళ్ళ నుంచి యెంతో గుంభనగా పట్టుకు వస్తున్న మన గౌరవ మర్యాదలు కాస్త మంటకలిసినాయి...."శాంతమ్మ కూడా యెంతో క్రోధంగా అన్నది.

"విషయాలు తెలుసుకోక పోవటం వలన, లేని గౌరవాలు వున్నాయను కోవటంవలన, మనవంశ మర్యాదలు దెబ్బతింటున్నాయిగాని, నిజం చెప్పటం వలన మనగౌరవానికి యెప్పుడూ దెబ్బకాదు..."

"మాకు తెలియని విషయాలు, నువ్వు తెలుసుకున్న విషయాలు యేమిటో చెప్పు...." మధు అందు కున్నాడు.

"ఇంట్లో ఆడపిల్లని ఏవగింపుగాను, అనుమానంగాను చూడటం, మగవాడు యేంచేస్తున్నా హర్షించి వూరుకుంటూ. మన గౌరవమంతా నాశనం అయి పోతోందనీ నా మీద పడి యేడవటం....ఇంతకంటె విడదీసి చెప్పాలా" వసంత రౌద్రంగా మధు వైపుకు చూసింది.

మధు కొంచెం ముందుకు తూగాడు.

శంకరం మధును విసురుగా నెట్టేశాడు.

'నాన్నా.... మీమనస్సుకు కష్టంగా వుంటే, యీ క్షణంలో నన్ను యేది చెయ్యమన్నా అది చేస్తాను. నేను పెళ్ళిచేసుకోకపోవడం వలన మన వంశానికి కళంకం వస్తుందని అనుకోకండి. నేను మీయింట్లో వుండేది చాలా కొద్దిరోజులే. తర్వాత నేను యెన్నడూ చూడని ఒక వ్యక్తిని భర్తగా స్వీకరించి మీకు యెంతో దూరంలో వుండిపోతాను. ఫలానావారి అమ్మాయి అని మీకు యెంతోగౌరవాన్ని, సంతోషాన్నియిస్తాను. నన్నుగురించి మీరు బాధపడకండి. మిమ్మల్ని అంటిపెట్టుకు వుంటూ మీసేవ చేస్తూ దగ్గరవుండే కొడుకు విషయం ఆలోచించుకోండి. అన్నయ్య గౌరవం, మీ గౌరవం, మీ వంశ గౌరవం....నలుగురు ఏమనుకుంటున్నారో కాస్తవినండి. మా అన్నయ్య అంటే నాకువుండే బాధకంటె, మీ కొడుకు అంటే మీకువుండే మానసికబాధ యేమిటో నాకు తెలుసు....అన్నయ్యా! మనవంశ గౌరవం నిలబెట్టు. నువ్వు పెళ్ళిచేసుకో...కళంకం తెచ్చిపెట్టక...."

శాంతమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ వసంత జుట్టు నిమురుతోంది. శంకరం శరీరం గజగజ వణికిపోతోంది.

మధు మథనపడిపోతున్నాడు. ఒళ్ళంతా కంపరం యెత్తిపోతోంది. తనచెల్లెలికి తన విషయం పూర్తిగా తెలిసిందని భయపడిపోతున్నాడు. మధుకు ఆలోచన పాలుపోవడంలేదు. బింకంగా ఇన్నాళ్ళనుంచి నెట్టుకు వస్తున్నాడు. ఈనాటితో ఇంట్లో వాళ్ళకికూడా తెలిసిపోయింది. పోనీ పెళ్ళిచేసుకోవటానికి యిష్టంగావున్నట్లు తల్లిదండ్రులకు చెపుదామా అంటే, ఇన్నాళ్ళనుంచి పెళ్ళి చేసుకోను అంటూవచ్చి, గభాలున పెళ్ళికి యిష్టపడ్డట్టు చెపితే యేవిధంగా అనుమానిస్తారో అనే భయం. వసంతకు తన అభిప్రాయాన్ని యేదోవిధంగా తెలియ చేద్దామాఅంటే, ధైర్యం చాలటంలేదు. వసంత చెప్పింది అక్షరాలా నిజమని తనమనస్సుకుతోస్తోంది. అనవసరంగా వసంత మనస్సు బాధపెట్టానే అని పశ్చాత్తాప పడుతున్నాడు. కంగారుగా ఒక్కసారి లేచినించున్నాడు మధు.

ఇంతలో యిద్దరు హఠాత్తుగా యింట్లోకి వచ్చేశారు. మధు ఆశ్చర్యంగావాళ్ళవంక చూస్తున్నాడు.

"శంకరంగారు....మీరు మాత్రం ఆడపిల్లలు కనలేదు టండీ, మీకు మాత్రం వంశగౌరవాలు లేవుటండీ, మమ్మల్ని యీవిధంగా అవమానిస్తారా ... యీనాడు యీపిల్ల యెక్కడికిపోతుంది మీరుచెప్పండి...."యాజులు కంఠంలో గీర వచ్చేసింది.

"ఎందుకు అంత ఆవేశపడతారు? మా అన్నయ్య మీ అమ్మాయిని పెళ్ళిచేసుకుంటాడుగా...." వసంత మధు ముఖంలోకి తీవ్రంగా చూసింది.

మధువంక, శంకరం కొరకొర చూశాడు.

"ఈ అమ్మాయినా.... మనమధు ...." శాంతమ్మ మధ్యలోనే ఆపెయ్యాలసి వచ్చింది.

"మనం తెచ్చిపెట్టుకున్న వంశగౌరవాలకంటె, ఒక ఆడదాని జీవితం యెన్నోరెట్లు ఎక్కువ. మెత్తగావుంటే అధోగతి పాలుచేద్దామని, ఆడపిల్లల్ని అన్యాయం చెయ్యకండి...."వసంత వుద్రేకంలో యింకా అంటోంది.

శంకరం మారు మాటాడకుండా అట్లాగేచూస్తూ నిలబడిపోయాడు.

"అమ్మాయి ...మా అమ్మాయి జీవితం నిలబెట్టావమ్మా...." వణుక్కుంటూ యాజులు వసంత దగ్గరగా వచ్చాడు.

"వసంతా నీ మనస్సు కనుక్కోలేక పోయాను.... నిన్ను ఏవేమిటో అంటూవచ్చాను....నిన్ను చాలా బాధ పెట్టాను. నీకు అన్నగా వుండటానికి నేను తగినవాణ్ణి కాను" అంటూ వసంత రెండు చేతులూ గట్టిగా పట్టుకున్నాడు మధు.

"ఎంతైనా నేను నీకు చెల్లెల్నే అన్నయ్యా" కళ్ళనీళ్ళు ఆపుకుంటూ ఎంతో నిబ్బరంగా అన్నది వసంత. ★